క్లుప్తంగా

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక


జీవీటీ రాజశేఖర్


తోట కృష్ణారావు

జగ్గయ్యపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ ఎల్.చిట్టిబాబు సోమవారం తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ జీవీటీ రాజశేఖర్, గౌరవరం జెడ్పీ పాఠశాలకు చెందిన తోట కృష్ణారావు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారికి మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్పందన ద్వారా 10 అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన 10 అర్జీలు అందాయని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు తెలిపారు. రెవెన్యూకు సంబంధించి 6, పోలీస్ శాఖ 1, హౌసింగ్ 1, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 1, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒకటి చొప్పున అర్జీలు అందాయన్నారు. వీటన్నిటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేయడంతో పాటు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

దివ్యాంగునికి నూతన పింఛన్ అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: పురపాలక సంఘ పరిధిలో ఇటీవల నూతనంగా మంజూరైన పింఛన్‌ను సోమవారం పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక 23 వ వార్డు మంగలి బజారుకు చెందిన చెరుకు రమేష్ అనే దివ్యాంగునికి కొత్తగా మంజూరైన రూ.3 వేల పింఛన్ నగదును సదరు వార్డు కౌన్సిలర్ దువ్వల రామకృష్ణ, వలంటీర్ కలసి అందజేశారు.

రేపటి నుంచి గ్రామాల్లో రీ సర్వే

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని గ్రామాల్లో ఈనెల 6 వ తేదీ నుంచి భూసర్వే ప్రక్రియ ప్రారంభం అవుతుందని తహసీల్దార్ సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ భూ సర్వే చేసే గ్రామాల వివరాలను వెల్లడించారు. మల్కాపురం, బూచవరం, రావికంపాడు, బలుసుపాడు, త్రిపురవరం, రావిరాల, గౌరవరం, కౌతా వారి అగ్రహారం గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ఈ గ్రామాలకు సంబంధించిన గ్రామ సచివాలయాల్లో ఈనెల 5 వ తేదీన సర్వే ప్రక్రియ అవగాహన సదస్సు నిర్వహిస్తారని తెలిపారు.

మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

పెనమలూరు: కారు తీసుకుని మోసం చేసిన భార్యాభర్తలపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌లో నివసించే తెలప్రోలు శ్రీనివాస్‌కు విజయవాడ ఎస్ఆర్‌పేటలో జూమ్‌కార్ సేల్స్ ఇండ్ సర్వీసెస్ యజమాని అల్లూరి శరత్‌చంద్రవర్మ, అతని భార్య జ్యోత్స్నప్రియతో పరిచయం ఉంది. శ్రీనివాస్ గత ఏడాది తన పాతకారును వారి ద్వారా విక్రయించాడు. వారి వద్ద మరో కారు కొన్నాడు. కొన్న కారుపై ఫైనాన్స్ తీసుకున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో అల్లూరి శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ పెనమలూరు వచ్చి చిన్నపని ఉందని శ్రీనివాస్ కొన్న కారును తీసుకెళ్లారు. ఆ తరువాత కారు తీసుకొచ్చి అప్పగించలేదు. అప్పటి నుంచి భార్యాభర్తలు కనిపించకుండా తిరుగుతున్నారని, తన కారు తీసుకుని మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోసం చేసిన భార్యాభర్తలపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

బైండోవర్ కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోడి పందేలు నిర్వహించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులపై నున్న పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. షేక్ మస్తాన్ అలియాస్ రాజు, మర్రెడ్డి రామకృష్ణారెడ్డి కోడి పందేలు వేయడానికి రాగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు.

పట్టణాభివృద్ధికి కలసికట్టుగా కృషి

- మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం
- వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పాకాలపాటి కృష్ణ
- అభినందించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పాకాలపాటి కృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నందిగామ పట్టణ అభివృద్ధికి కలసికట్టుగా పని చేయాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా 30 ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని పట్టణ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణ పనులు చేపట్టామని, రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే గాంధీ సెంటర్ సుందరీకరణ పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వైస్ చైర్మన్‌గా పాకాలపాటి కృష్ణ ఎన్నిక

మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ప్రసన్నలక్ష్మి వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో ఒకటవ వార్డు కౌన్సిల్ సభ్యుడు పాకాలపాటి కృష్ణ అలియాస్ కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కృష్ణకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఎన్నికల అధికారితో కలిసి నియామక పత్రం అందజేశారు. అనంతరం అధికారులు, కౌన్సిల్ సభ్యుల సమక్షంలో కౌన్సిల్ హాల్‌లో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కృష్ణను ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు.

నిష్పక్షపాతంగా బాధ్యతలు నిర్వహిస్తా

ఎంతో నమ్మకంతో తనపై పెట్టిన గురుతర బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ తెలిపారు. వైస్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో పట్టణాభివృద్ధికి తన వంతుగా కృషి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు ఆయన్ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కౌన్సిలర్లు తానూరి రాము, షేక్ ఖాలిక్, మారం అమరయ్య, షేక్ యాకుబ్ అలీ, విశ్వనాథపల్లి వాణి, గద్దె శేషుకుమారి, బాపట్ల సాంబయ్య, బండారు గంగమ్మ, మందా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర


కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు పోతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక పెద్ద మసీదుకు ఆనుకుని నిర్మిస్తున్న డ్రైనేజ్, కల్వర్టు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా కాలం నుంచి ఉన్న ఈ సమస్య పరిష్కారం కోసం స్థానికులు కోరిన మేరకు సుమారు రూ.10 లక్షల వ్యయంతో పురపాలక సంఘ నిధులతో డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచనల మేరకు పట్టణంలో అవసరమైన ప్రదేశాలను గుర్తించి నూతన పైపులైన్ల ఏర్పాటు, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగు పరచడం, రోడ్ల నిర్మాణ పనులు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, మున్సిపల్ ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డీజేల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి


సచివాలయ మహిళా కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్ఐ అభిమన్యు

వత్సవాయి: గ్రామాల్లో ఉత్సవాలు పెళ్లిళ్లకు డీజేలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పకుండా అనుమతులు ఉండాలని ఎస్ఐ బి.అభిమన్యు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు, డీజేల నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా పోటీలు పడుతూ డీజేలను ఏర్పాటుచేసి ప్రజలకు ఆటంకం కలిగిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డీజేల వల్ల గ్రామంలో గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెలలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని నందిగామ డీఎస్పీ నుంచి అనుమతులు పొందిన మేరకే డీజేలు ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. అనుమతులు లేకుండా ఏర్పాటుచేసే డీజే నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు బాక్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమతులు లేని డీజేల గురించి సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు అందించాలని చెప్పారు.

అధికారులపై వ్యక్తిగత దూషణలు తగదు

- మున్సిపల్ కమిషనర్‌పై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు ఖండన
- నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన సిబ్బంది


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ సిబ్బంది

నందిగామ: ప్రభుత్వ అధికారులపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్ అన్నారు. గాంధీ సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదివారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంపై పలు వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇదే తరహా వ్యాఖ్యలు మరోసారి పునరావృతమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


ఎమ్మెల్యే జగన్‌మోహనరావుతో కలిసి ఎమ్మెల్సీ జన్మదిన కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించటం సంతోషంగా ఉందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన సోదరుడు, ఎమ్మెల్సీ అరుణకుమార్ జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ తనపై, తన సోదరుడిపై నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనివన్నారు. అందుకు తాము జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు గుడివాడ సాంబశివరావు, షేక్ కరిముల్లా, నల్లమల్లి మురళి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, కర్రి రవీంద్ర, మన్నం దాసు తదితరులు పాల్గొన్నారు.

జుజ్జూరులో...

జుజ్జూరు(వీరులపాడు): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కష్టమొచ్చినా తామున్నామంటూ అండగా నిలుస్తున్న శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రజల మనసులు గెలుచుకున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జన్మదిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు పూలా పుల్లయ్య, ఫయాజ్, జయాలుద్దీన్, కొమ్మూరి శాంత, రమావత్ రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తోటచర్ల(పెనుగంచిప్రోలు): మండల పరిధిలోని తోటచర్ల వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలైన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి గుడివాడ వెళ్తున్న కారు తోటచర్ల వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిని 108 ఆసుపత్రిలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్ల కుమారుడితో తల్లి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మూడేళ్ల కుమారుడితో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...విద్యాధరపురం సితార కన్వెన్షన్ సెంటర్‌కు చెందిన షేక్ బాజీ నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు వెన్నెముక సమస్య ఉండడంతో అతనిని వైద్యుల వద్ద చూపిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో బాజీ తన కుమారుడు గౌతంతో కలిసి తల్లిగారింటి వద్దనే ఉంటోంది. తన కుమారుడిని ఆసుపత్రిలో సరిగా చూపించడం లేదని ఈనెల 2వ తేదీ ఉదయం బాజీ పుట్టింటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై బాజీ తల్లి షేక్ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టికెట్ చెకింగ్ సిబ్బందికి గుండె పరీక్షలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో విజయవాడ డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి సోమవారం గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్ చెకింగ్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ శిబిరంలో నిర్వహించిన స్క్రీనింగ్ ప్రక్రియలో అవాంఛనీయ లక్షణాలను ముందుగానే గుర్తించి రాబోయే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ శిబిరం 1, 6–7 ప్లాట్‌ఫామ్‌లలోని ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో 7 రోజుల పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేస్తుందన్నారు. శిబిరాన్ని రైల్వే సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 71 మంది టికెట్ చెకింగ్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక కాలనీకి చెందిన మహిళ కనిపించడంలేదని నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కండ్రిక కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద భర్త నాగార్జున, అత్తతో ఉంటున్న తనుకుల నాగజ్యోతి ఈ నెల 3వ తేదీన పుట్టింటికని చెప్పి బంటుమిల్లి వెళ్లింది. భర్త ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. నాగజ్యోతి అన్నయ్యను విచారించగా ఇక్కడకు రాలేదని చెప్పాడు. అత్త నాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

గృహాల మధ్య ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచాలి


గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో కంపచెట్ల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేటఅర్బన్: జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఆరవ వార్డు పరిధిలో గృహాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో మరుగుగా ఉన్న ఆ స్థలాలలో విష సర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ శానిటరీ మేస్త్రి నాగరాజు సహకారంతో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ బుల్‌డోజర్‌తో ఆ ప్రదేశాలలోని కంపచెట్లను బాగుచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు పంపిస్తామని చెప్పారు. వారి స్థలాలను వారే బాగుచేసుకొని ఫెన్సింగ్ వేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్ ఆడుతున్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట: ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందిస్తామని ప్రిన్సిపాల్ టి.ఉమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పులికొండ మాధవి, ఎస్.రమ, రవికుమార్, మురళీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నవరంలో నా భూమి - నా దేశం


నా భూమి - నా దేశం కార్యక్రమంలో బీజేపీ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి సుజనా చౌదరి

పొన్నవరం(వీరులపాడు): దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనేదే ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన నాభూమి–నా దేశం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు సుజనాచౌదరి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని పొన్నవరం గ్రామంలో సోమవారం ఆయన నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాన్ని గుర్తు చేస్తూ వారి మాతృభూమికి గౌరవం ఇచ్చేందుకే ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ రాజు, మాజీ సర్పంచ్ కోయా సాయిరాజా, నాయకులు కంఠంనేని రాజశేఖర్, శ్రీధర్, తొర్లికొండ సీతారామయ్య, బండారు కేదార్‌నాథ్ శర్మ పాల్గొన్నారు.

20 కొండముచ్చులు పట్టివేత

ఇందుగపల్లి(వత్సవాయి): గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను గాయపరుస్తున్న కొండముచ్చులను సోమవారం వలల ద్వారా పట్టుకున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన పెద్దపోగు సామేలు కొండముచ్చుల దాడిలో మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను మృతుని ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొండముచ్చులు చేస్తున్న దాడుల గురించి ఆయనకు వారు విన్నవించుకోగా వెంటనే స్పందించిన ఆయన కొండముచ్చులను పట్టించేందుకు తన సొంత ఖర్చులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వలల ద్వారా 20 కొండముచ్చులను పట్టుకుని ప్రత్యేక వాహనంలో అటవీప్రాంతంలో వదిలివేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభానుకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

చిన్నారుల బరువులపై తల్లిదండ్రులకు అవగాహన


తల్లులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు చిన్నారుల బరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, తాజా కూరగాయలు తినటం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. దీనికి సంబంధించి పిల్లలకు కథల ద్వారా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, ఆరోగ్యసిబ్బంది రాఘవప్రభ, వెంకట్రావమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి గంగాళం వితరణ

తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థానానికి వెండి గంగాళాన్ని ఒక దాత సోమవారం వితరణ ఇచ్చారు. సుమారు రూ.10వేల విలువైన గంగాళాన్ని ఆలయంలో స్వామివారి తీర్థప్రసాదాల నిమిత్తం ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావుకు వ్యాపార ప్రముఖుడు పాలెపు నరసింహారావు అందజేశారు. శ్రీరంగనాయకస్వామి దేవస్థానం, శ్రీకోదండ రామాలయాలలో కూడా నరసింహారావు వెండిగంగాళాలు వితరణ ఇచ్చినట్లు ఆలయ ధర్మకర్తలు దారా రంగారావు, సోమవరపు సత్యనారాయణ తెలిపారు.